# ఎస్ఎంసీ ఎన్నికలకు నేడు నోటిఫికేషన్

నెల్లికుదురు/హనుమకొండ సిటీ/భూపాలపల్లి రూరల్/జనగామ చౌరస్తా, జనవరి 19 : పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)లను ఈ నెల 29న ఎన్నుకోనున్నారు. ఈమేరకు విద్యాశాఖ కమిషనర్ దేవసేన ఈ నెల 18న ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నిర్వహణ కోసం అధికారికంగా ఈ నెల 20న నోటిఫికేషన్ జారీ చేసి, 29న ఎన్నికలు నిర్వహించనున్నారు. 2019లో పాఠశాల యాజమాన్య కమిటీలను ఎన్నుకున్నారు. వాటి గడువు 2021తో ముగియగా తిరిగి ఆరు నెలలపాటు పొడిగించారు. అది కూడా పూర్తవడంతో 6 నెలల చొప్పున పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పాత కమిటీలే కొనసాగుతున్నాయి. కాగా, నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. కాగా, ఈ ఎన్నికకు సంబంధించి పాఠశాల హెచ్ఎంలు ఈ నెల 20న ఉదయం 10గంటలకు నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అదేరోజు మధ్యాహ్నం 2గంటలకు నోటీసు బోర్డులో విద్యార్థుల తల్లిదండ్రుల(ఓటర్లు) జాబితాను ప్రదర్శిస్తారు. 22, 23 తేదీల్లో సాయంత్రం 4గంటల వరకు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. 24న ఎస్ఎంసీ సభ్యుల ఎన్నిక కోసం తుది జాబితాను విడుదల చేస్తారు. చేతులెత్తే పద్ధతి ద్వారా గానీ, తప్పని పరిస్థితుల్లో రహస్య బ్యాలెట్ విధానం ద్వారా గానీ 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. అదేరోజు 1.30 గంటల తర్వాత ఎన్నికైన సభ్యుల నుంచి చైర్మన్, వైస్‌చైర్మన్‌ను ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేయిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఎస్ఎంసీ ప్రథమ సమావేశం నిర్వహిస్తారు.


## నేడు మంత్రి పొంగులేటి సమీక్ష

హనుమకొండ, జనవరి 19 : హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాలోని వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, ఇన్ఫర్మేషన్, పబ్లిక్ రిలేషన్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్షించనున్నారు. ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అధికారులు పాల్గొననున్నారు. అనంతరం ఖమ్మం వెళ్లనున్నారు.

## పారామెడికల్ సీట్ల భర్తీకి 23న కౌన్సెలింగ్

వరంగల్ చౌరస్తా, జనవరి 19: కేఎంసీ పారా మెడికల్ కోర్సుల్లో ఖాళీగా ఉన్న 94సీట్ల భర్తీకి రెండో విడుత, మాప్ అప్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 23న కళాశాలలో ఉదయం 8.30 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డీఎంఎల్‌టీ 15, డీఏఎన్ఎస్ 1, డీ కార్డియో 3, డీఆర్‌జీఏ 2, డీడీఆర్ఏ 6, డీఈసీజీ 6, డీడీఏఐఎల్‌వై 2, డీఓఏ 12, డీఎంఎస్‌టీ 10, డీఎంఐటీ 12, డీఆర్ఈఎస్‌టీ 17, డీఈపీటీ 8 విభాగాల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. మొదటి విడుత కౌన్సెలింగ్‌లో సీటు పొందినవారు సైతం ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

# నిఘా నేత్రం ఎక్కడ?



'ఓ'సిటీ గ్రౌండ్ ప్రధాన రహదారిలో సీసీ కెమెరాలు లేకుండా కేవలం స్టాండే ఉన్న దృశ్యం



కోటిలింగాల రోడ్డులోని సొసైటీకాలనీ ఆర్చ్ వద్ద నేలకు చూస్తున్న సీసీ కెమెరా

### పట్టపగలే రెచ్చిపోతున్న దొంగలు.. పెరుగుతున్న దొంగతనాలు, ఆకతాయిల దాడులు

- ఇళ్లలోని నగదు, నగలు చోరీ
- ఆలయాల్లో దేవుడి ఆభరణాలకూ రక్షణ కరువు
- పోలీస్‌స్టేషన్లలో ఎక్కువవుతున్న 'చోరీ కేసులు'
- వృథాగా పడి ఉంటున్న సీసీ కెమెరాలు
- పోలీసులు అడ్డుకట్ట వేయాలంటున్న ప్రజలు



కాశీబుగ్గలోని సొసైటీ కాలనీలో సీసీ కెమెరాకు అడ్డుగా ఉన్న చెట్టుకొమ్మలు

*కొద్దిరోజుల నుంచి దొంగలు రెచ్చిపోతున్నారు. పట్టణాలు, పల్లెల్లో దర్జాగా తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లలో చొరబడి లూటీ చేసేస్తున్నారు. ఇటు ఆలయాల్లోనూ ప్రవేశించి దేవుడి ఆభరణాలు, హుండీలను పగులగొట్టి నగదు ఎత్తుకెళ్తుంటే.. ఇంకొందరు భక్తుడిలా వచ్చి దేవుడికే శఠగోపం పెడుతున్న తీరు విస్తుగొల్పుతున్నది. ముఖ్యంగా వరంగల్ నగరంలో ఆకతాయిలు రెచ్చిపోతున్న ఘటనలు తరచూ వెలుగుచూస్తున్నాయి. అయితే చాలాచోట్ల సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, పోలీసుల నిఘా లేకపోవడం వల్లే దొంగతనాలు, రౌడీషీటర్ల ఆగడాలు పెరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో చోరీలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరమున్నది.*

*– వరంగల్, జనవరి 19 (నమస్తే తెలంగాణ)*

తాజాగా వరంగల్ గిర్మాజీపేటలోని ఎల్లమ్మ గుడిలోకి బుధవారం భక్తుడి ముసుగులో వచ్చిన ఓ వ్యక్తి అమ్మవారికి మొక్కుతున్నట్లు నటించి అమ్మవారి మెడలోని ఏడు గ్రాముల బంగారు పుస్తెలతాడు ఎత్తుకెళ్లాడు. ఆలయ చైర్మన్ ఫిర్యాదుతో ఇంతెజార్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇలా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో దొంగలు రెచ్చిపోతున్నారు.

వరంగల్ జిల్లాలో ఇటీవలి కాలంలో జరిగిన కొన్ని చోరీలను పరిశీలిస్తే వరంగల్ శివనగర్‌లోని రాయల రవి కుటుంబం గత డిసెంబర్ 11న విహారయాత్రకు వెళ్లింది. తిరిగి రాకముందే ఇంట్లో చోరీ జరిగినట్లు యాత్రలో ఉన్న ఆయనకు స్థానికుల ద్వారా సమాచారం అందింది. రవి వచ్చిన తర్వాత పోలీసులు ఇంట్లో పరిశీలించగా రూ.7లక్షల నగదు, 80 తులాల బంగారం ఆభరణాలు చోరీ జరిగినట్లు వెల్లడైంది. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

డిసెంబర్ 18న వరంగల్‌లో మిల్స్‌కాలనీ స్టేషన్ పరిధిలోని ఆటోడ్రైవర్ చేతి దిలీప్ తన కుటుంబంతో వర్ధన్నపేట మండలంలోని కొత్తపల్లి గ్రామానికి వెళ్లాడు. మరుసటి రోజు ఆయన తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని ఐదున్నర తులాల బంగారం, ఆభరణాలు కనిపించలేదు. ఇతర వస్తువులు కూడా లేకపోవడంతో దిలీప్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఈ ఏడాది జనవరి 5న వరంగల్ బొల్లికుంటలో సోల్తి అశోక్ తన కుటుంబ సభ్యులతో కలిసి గుడికి వెళ్లారు. దర్శనం చేసుకొని తిరిగి వచ్చేలోపు పట్టపగలే దొంగలు తాళం పగులగొట్టి రూ.2 లక్షల నగదు, రూ.2.50 లక్షల విలువ చేసే ఐదు తులాల బంగారం నగలను అపహరించారు. మామునూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండో వారంలో వరంగల్ రామన్నపేటలో ఒక ఆడిటర్ ఇంట్లో చోరీ జరిగింది. అమెరికా వెళ్లిన ఆడిటర్ ఇంట్లోకి దొంగలు ప్రవేశించి నగలు ఎత్తుకెళ్లారు.

నాలుగు రోజుల క్రితం ఖానాపురం మండల కేంద్రంలో ఓ కుటుంబం వేములవాడకు వెళ్లింది. తిరిగి వచ్చే వరకు తమ ఇంట్లోని బంగారం నగలు మాయమైనట్లు సదరు కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రెండు రోజుల క్రితం నర్సంపేటలో ఒక వ్యాపారి ఇంట్లో చోరీ జరిగింది.

### ఇటీవల కాలంలో పెరిగిన దాడులు..

చోరీలతో పాటు దాడులు, ప్రతిదాడులు కూడా పెరిగాయి. ఆకతాయిల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నది. రౌడీషీటర్లలో కొందరు మళ్లీ జూలు విదిలిస్తున్నారు. ప్రధానంగా వరంగల్‌లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకొంటున్నాయి. గత డిసెంబర్ 31న శివనగర్‌లో ముగ్గురు వ్యక్తులు ఓ యువకుడిపై రాళ్లు, గాజుపెంకులతో దాడికి తెగబడ్డారు. కొద్దిరోజుల క్రితం కరీమాబాద్ ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు ఓ యువకుడిని తీవ్రంగా కొట్టారు. ఉర్సు బీఆర్‌నగర్‌లో ఓ యువకుడిపై కొందరు కత్తులు, రాళ్లతో దాడికి ఒడిగట్టారు. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడి తలపై ఓ వ్యక్తి కత్తితో పొడిచాడు. శివనగర్‌లో ఇటీవల ఒకరి ఇంటి ముందు పార్కు చేసి ఉన్న కారుకు కొందరు నిప్పు పెట్టారు. పోలీసుల నిఘా కొరవడడం వల్లే చోరీలు, దాడులు జరుగుతున్నట్లు స్థానికులు భావిస్తున్నారు. వరంగల్‌తో పాటు ఇతర పట్టణాలు, గ్రామాల్లో గతంలో పోలీసులు దాతలు, వ్యాపారులు, స్థానికుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు చాలావరకు పనిచేయడం లేదు. కొన్ని చోట్ల కెమెరాలు ధ్వంసమయ్యాయి. కెమెరాలు పగిలి, వైర్లు తెగి ఉన్నాయి. మరి కొన్ని చోట్ల సీసీ కెమెరాలు దర్శనమిస్తున్నా అవి పనికి రాకుండా ఉన్నాయి. తమ వ్యవహారం బయట పడుతుందని ఆకతాయిలు, దొంగలు, రౌడీషీటర్లు కొందరు సీసీ కెమెరాలు పనిచేయకుండా చేస్తున్నట్లు తెలిసింది. దీంతో వరంగల్ సహా ఇతర ప్రాంతాల్లో జరిగేవేవీ సీసీ కెమెరాల్లో నమోదు కావడం లేదు. వెరసి పోలీసులు గతంలో మాదిరిగా సులువుగా నేరస్తులను గుర్తించలేకపోతున్నట్లు సమాచారం.





విద్యుత్ వెలుగుల్లో నిట్



# సరికొత్త ఆలోచనలు.. నూతన ఆవిష్కరణలు

## నిట్‌లో టెక్నోజియాన్-24 ప్రారంభం

**ఆకట్టుకున్న ఎగ్జిబిట్లు.. ప్రత్యేక ఆకర్షణగా కొత్త ఇన్నోవేషన్స్**

**ప్రారంభించిన ఇన్‌చార్జి డైరెక్టర్ వీటీ సోమశేఖర్**

హనుమకొండ చౌరస్తా, జనవరి 19 : సరికొత్త ఆలోచనలు.. నూతన ఆవిష్కరణలకు నిట్ వేదికగా నిలిచింది. టెక్నోజియాన్-24(ఇన్‌జీనియస్) వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే ఈ టెక్నోజియాన్‌లో శనివారం ఇంజినీరింగ్ విద్యార్థులు సుమారు 40 టెక్నికల్ ఈవెంట్లు ప్రదర్శించనున్నారు. టెక్నోజియాన్ ప్రారంభోత్సవం సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థుల ఎగ్జిబిట్ల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. టైం డిటెక్షన్ అలారం, రోబోటిక్ బాస్కెట్‌బాల్ గేమ్, మెటల్ గ్రాబింగ్ డివైజ్, ఆటోమెటిక్ డ్రైనేజీ క్లీనింగ్ సిస్టమ్, స్మార్ట్ బ్లైండ్ స్టిక్ ఎగ్జిబిట్లు ఆకట్టుకున్నాయి. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో విద్యార్థులకు అనుభవాన్ని అందించడానికి ట్రేడింగ్ పిట్ నిర్వహించారు. ఎక్కువ డబ్బు సంపాదించిన విద్యార్థులను విజేతలుగా ప్రకటిస్తారు. అలాగే ఆర్బిస్, క్రాక్ ది క్వెరీ, ఇన్నోచెమ్, క్రియేటివ్ రోబోటిక్స్ ప్రదర్శించారు.

### టెక్నోజియాన్ లెర్నింగ్ ప్లేస్..

టెక్నోజియాన్ ముఖ్యమైన లెర్నింగ్ ప్లేస్ అని నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్, రిసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డీన్ ప్రొఫెసర్ వీటీ సోమశేఖర్ అన్నారు. స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ శ్రీనివాసాచార్య, స్టూడెంట్స్ యాక్టివిటీ సెంటర్ ప్రెసిడెంట్ హరికృష్ణ, ఫ్యాకల్టీ అడ్వైజర్ హరిప్రసాద్‌రెడ్డి సమక్షంలో సోమశేఖర్ జ్యోతిప్రజ్వలన చేసి టెక్నోజియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. టెక్నోజియాన్ గ్రాండ్ సక్సెస్ కావాలని ఆకాంక్షించారు.



స్కూల్ విద్యార్థులు ప్రదర్శిస్తున్న రోబోటిక్





వరంగల్ నిట్‌లో పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న కళాశాల విద్యార్థులు

# పత్తి రేటు డౌన్

- దిగాలు చెందుతున్న రైతులు
- సీసీఐ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,020
- రూ.6,500కే ప్రైవేట్ వ్యాపారుల కొనుగోలు



కాశీబుగ్గ, జనవరి 19 : పత్తి పంట ధర రోజురోజుకూ పడిపోతున్నది. గిట్టుబాటు ధర లభించకపోవడంతో పత్తి రైతులు దిగాలు చెందుతున్నారు. గత ఏడాదితో పోల్చితే ఈసారి చాలావరకు దిగుబడి తగ్గడంతోపాటు ధరలు కూడా తగ్గాయి. అక్టోబర్ 30న క్వింటాల్ పత్తికి అత్యధికంగా రూ.7వేల 160 పలికింది. భారత ప్రభుత్వ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) క్వింటాల్‌కు రూ.7,020 మద్దతు ధర నిర్ణయించింది. నవంబర్ 1వ తేదీ నుంచి ఈ ధరకు కొనుగోలు చేసేందుకు మార్కెట్ పరిధిలో సెంటర్ ఏర్పాటు చేసింది. వరంగల్ మార్కెట్ పరిధిలోని ఎనుమాముల, గొర్రెకుంట, కొత్తపేటలో ఉన్న టీఎంసీ, జిన్నింగ్ మిల్లుల వద్ద కూడా రైతులు నేరుగా లూజు పత్తిని తీసుకెళ్లి అమ్ముకునేలా వెసులుబాటు కల్పించారు. తేమ శాతం ఎక్కువ ఉందని, నాణ్యతగా లేదంటూ కొర్రీలు పెట్టి మద్దతు ధర కంటే తక్కువగానే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తరుగు ఎక్కువగా తీస్తున్నట్లు పలువురు రైతులు బోరుమంటున్నారు. గత ఏడాది క్వింటాల్ పత్తి అత్యధికంగా రూ.8,500 పలికింది. ఈ ఏడాది సీజన్ ప్రారంభంలోనే సీసీఐ మద్దతు ధర నిర్ణయించగా, ప్రైవేట్ వ్యాపారులు మద్దతు ధర కంటే తక్కువకు కొంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి డిమాండ్ లేదని, ఈసారి పత్తి నాణ్యత బాగా తగ్గిందని, అందుకే తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నట్లు వ్యాపారులు తెలిపారు. ఈ సీజన్ అక్టోబర్ నుంచి గురువారం వరకు మార్కెట్‌కు 6లక్షల 77వేల 14 క్వింటాళ్ల పత్తి రాగా ప్రైవేట్ వ్యాపారులు లక్షా 33వేల 55 వందల క్వింటాళ్లు, లూజు పత్తి 70వేల 985 క్వింటాళ్లు, వ్యాపారులు జిన్నింగ్ మిల్లుల వద్ద 27వేల 245 క్వింటాళ్లు, సీసీఐ వారు 3లక్షల 66వేల 117 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు అధికారులు వివరించారు.

# 22న అవార్డును అందుకోనున్న పెండ్యాల లక్ష్మీప్రియ

### పీఎం రాష్ట్రీయ బాల పురస్కార్‌కు ఎంపిక

హనుమకొండ సిటీ, జనవరి 19: వివిధ కళల్లో విద్యార్థులకు అందించే ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార అవార్డుకు ఎంపికైన జిల్లా విద్యార్థిని పెండ్యాల లక్ష్మి ప్రియ ఈ నెల 22న అవార్డును అందుకోనున్నట్లు విద్యార్థి తండ్రి రాకేశ్ తెలిపారు. ఢిల్లీలోని ఆనంద భవన్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బాల పురస్కార్ అవార్డు అందుకోనున్నట్లు పేర్కొన్నారు. జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్ కు రాష్ట్ర అంబాసిడర్‌గా హాజరై ప్రధానమంత్రి మోడీ, రాష్ట్రపతిని కలువ నున్నట్లు ఆయన తెలిపారు. కాగా కాజీపేట మౌంట్ ఫోర్ట్ లో 10వ తరగతి చదువు తున్న లక్ష్మీ ప్రియ గత సంవత్సరం జనవరిలో భువనేశ్వర్‌లో జరిగిన జాతీయస్థాయి కళా ఉత్సవాల్లో ప్రథమ బహుమతి అందుకోవడం విశేషం. బొంపల్లి సుధీర్ రావు పర్యవేక్షణలో ఏడు సంవత్సరాలుగా కూచిపూడిలో శిక్షణ తీసుకుంటూ వివిధ వేదికల్లో జాతీయ స్థాయిలో రాణిస్తోంది.




గురువు సుధీర్ రావుతో లక్ష్మీ ప్రియ

# ప్రతి ఎకరాకు సాగునీరందించాలి

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 19 : స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని దేవాదుల రిజర్వాయర్ల పరిధిలోని పంట కాల్వలకు మరమ్మతులు చేపట్టి ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి నీటి పారుదల శాఖ అధికారులను కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధలో నీటిపారుదల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. శ్రీహరి మాట్లాడుతూ నియోజకవర్గంలోని దేవాదుల రిజర్వాయర్ల పరిధిలోని పంట కాల్వల్లో పూడికపేరుకుపోవడం, తూములు, షటర్లు సరిగ్గా పనిచేయకపోవడంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందడంలేదన్నారు. దీనిపై అధికారుల పర్యవేక్షణ సరిగా లేదన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, మల్లన్నగండి, అశ్వరావుపల్లి, నవాబుపేట రిజర్వాయర్ల కట్టలపై మురికి తుమ్మలు పెరిగాయన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి నవాబుపేట రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన కాల్వ మట్టితో కూడుకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరు ఇవ్వడం లేదని తెలిపారు. కాల్వల్లో పూడిక మట్టిని తీసి, తూములు, షటర్లకు మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన చోట కొత్త షటర్లు అమర్చాలన్నారు. స్టేషన్ ఘన్‌పూర్, నవాబుపేట రిజర్వాయర్ కాల్వల్లో లైనింగ్ పనులు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఇంజినీరింగ్ చీఫ్(ఓ అండ్ ఎం) నాగేందర్, చీఫ్ ఇంజినీర్ రమేశ్, ఎస్ఈ సుధీర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి